

చీనీ ధర పతనం




కాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతు కూలీలు



- టన్ను రూ.15వేలకు పడిపోయిన ధర
- జిల్లాలో మూడు వేల ఎకరాల్లో సాగు
- రైతులకు చేదు మిగిల్చిన చీనీ
- పెట్టుబడులు కూడా అందని దుస్థితి
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీనీ పండ్ల ధర భారీగా పతనమైంది. గత ఏడాది అధిక ధరలతో అన్నదాతలకు ఆనందం పంచిన చీనీ సాగు ఈ ఏడాది నష్టాలను మిగిల్చింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో చీనీ ధరలు టన్ను రూ.15వేలకు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం నాణ్యతను బట్టి వీటి ధర టన్ను రూ.80వేల నుంచి లక్ష వరకూ పలకడంతో అన్నదాతలు వీటి దిగుబడిపై ఎంతో ఆశలు పెంచుకున్నారు. ఈసారి తీరా పంట చేతికొచ్చిన సమయానికి ప్రస్తుతం రూ.15వేలకు మించి పలకడం లేదని పేర్కొంటున్నారు. రైతన్నలకు తీపిని పంచాల్సిన చీనీ చేదును మిగిల్చినట్లు వాపోతున్నారు. ఇప్పటికే ప్రతి ఏటా చీనీ సాగు పడిపోతూ వస్తుండగా అదే స్థాయిలో ఈఏడాది ధరలు సైతం అధఃపాతాళానికి పడిపోవడం బత్తాయి రైతులను కోలుకో లేని దెబ్బతీసింది. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని చీనీ దిగుబడి సాధిస్తే, ధరలు లేక పెట్టుబడులు కూడా రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ఎకరానికి రూ.50వేలకు పైగా పెట్టుబడుల రూపంలో ఖర్చవుతుండగా, ధరలు పడిపోవడంతో పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేసినట్లు అధికారులు పేర్కొంటుండగా సాగు మరింత ఎక్కువే ఉండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఒక్క కొలిమిగుండ్ల మండలంలోనే సుమారు 200ఎకరాల్లో చీనీ తోటలు సాగుచేశారు. గతంలో కర్ణాటక, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు దిగుబడి రాక మునుపే రైతులను ఆశ్రయించి కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం రైతులే వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు.

కొలిమిగుండ్లలో సాగు చేసిన చీనీ పంట



రాయలసీమలోనే అత్యధికంగా..

మెట్ట ప్రాంతాలకు ప్రసిద్ధిగా ఉన్న రాయలసీమలో రాష్ట్రంలోనే అత్యధికంగా చీనీ సాగవుతున్నట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో చీనీ సాగు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే చీనీకి ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం చీనీ సాగు, ధరలపై దృష్టి సారించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



కాయలు రాలి నష్టపోగా..

ఈ ఏడాది చీనీ సాగులో తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షంతో కాయలు రాలి నష్టపోగా, వచ్చిన దిగుబడికి ధరలేక నష్టల్లో కూరుకపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

● పెద్దపెద్దయ్య, రైతు, కొలిమిగుండ్ల



నాలుగెకరాల్లో చీనీ సాగు చేశా

నాలుగు ఎకరాల్లో చీనీ సాగుచేశా. ఎకరాకు రూ.60వేలు పెట్టిబడి పెడితే, ప్రస్తుతం రూ.30వేలు కూడా దిగుబడి రావడంలేదు. చీనీ రైతులకు సాయం అందించాలి.

● పుల్లయ్య, రైతు



పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది

గతంలో ఈసమయంలో వచ్చే కత్తెర కాయకు మంచి డిమాండ్ ఉండేది. ఈఏడాది రూ.15వేలకు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. 15 ఎకరాల్లో చీనీ సాగు చేశా. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.

● పేరం నాగేశ్వరరెడ్డి, రైతు, కొలిమిగుండ్ల

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఉపాధ్యాయులను నామినేట్ చేసేందుకు అర్హత కలిగినవారు ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి నేరారోపణలు లేని వారు మాత్రమే అర్హులని, తమపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవనే ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. అదనపు, సహపాఠ్య కార్యకలాపాలను నిర్వహించడం, పిల్లలతో సామాజిక చలనశీలత, అనుభవపూర్వక అభ్యాసానికి భరోసా, ప్రతి పాఠం కోసం బోధనా అభ్యాస సామగ్రిని ఉపయోగించడం వంటి ప్రత్యేక చర్యలను అవార్డుకు ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా డైట్ ప్రిన్సిపాల్, ఎస్జీవో ప్రతినిధి, ఒక జిల్లా అధికారి సభ్యులుగా ఎంపిక కమిటీ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయాల్లో గానీ, డీఈవో కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి వర్షాలు



నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం నుంచి 7వ తేదీ వరకు ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశముందని విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం ప్రకటించింది. మంగళవారం కర్నూలు జిల్లాలో 115 ఎంఎం నుంచి 204 ఎంఎం వరకు భారీ వర్షం పడే అవకాశముందని, నంద్యాల జిల్లాలో 64 ఎంఎం నుంచి 115 ఎంఎం వరకు మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని ప్రకటించారు. అలాగే 6, 7వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలో సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు 97 ఫిర్యాదులు అందజేశారు. ముఖ్యంగా నందమూరినగర్‌కు చెందిన రాముడు, ఆళ్లగడ్డకు చెందిన రామోజీరావు ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. భూములకు సంబంధించిన సమస్యల గురించి ఎస్పీకి ఏకరువు పెట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారించి సంతృప్తికరమైన పరిష్కారం చూపుతామన్నారు. చట్టపరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు నేస్తాలు

పంట పొలాల్లో కొంగల సందడి

కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొంగలు.. రైతు నేస్తాలుగా మారాయి. అన్నదాతలు ఖరీఫ్ సీజన్ పంటలను జోరుగా సాగు చేస్తుండగా కొంగలు గుంపులు గుంపులుగా పొలాల్లో చేరి, రైత న్నలకు హాని కలిగించే కీటకాలను తింటూ సహకరిస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో రైతు నేస్తాలుగా పిలిచే కొంగల గుంపులు సందడి చేస్తున్నాయి. భూమిలో రైతులకు మేలుచేసే పోషకాలతో పాటు కీడు చేసే కీటకాలు సైతం అధికంగా ఉంటాయి. అయితే రైతులు సాగు కోసం భూమిని కలియదున్నుతున్న సమయంలో బయటపడే కీటకాలను కొంగలు తిని వేస్తూ అన్నదాతలకు నేస్తాలుగా మారుతున్నాయి. ఈ దృశ్యాలు రైతులను కనువిందు చేస్తున్నాయి.



బెలుంశింగవరం సమీపంలో రైతు సేద్యం చేస్తుండగా కీటకాలను తింటున్న కొంగలు

వీబీఆర్‌కు జలకళ

- ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- నీటినిల్వలు 16.32 టీఎంసీలు 6

క్లాసులు ఫుల్

- నెహ్రూ మెమోరియల్ పాఠశాలకు విద్యార్థుల తాకిడి 7
- కిక్కిరిసిన తరగతి గదులు
- 'ఎక్స్' వేదికగా మంత్రి నారా లోకేశ్ అభినందన

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజకుమారి
- ఆత్మకూరు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తుల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం కేంద్రంగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా వినతులకు సంబంధించి బేతంచెర్ల, పాణ్యం, నంద్యాల రూరల్, రుద్రవరం, బనగానపల్లె, కొత్తపల్లి, జూపాడుబంగ్లా మండలాల్లో ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇదిలావుంటే డివిజన్ స్థాయిలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను పాల్గొన్న పీజీఆర్ఎస్‌కు సుమారు 300 వరకు దరఖాస్తులు వస్తే ఆత్మకూరు డివిజన్ స్థాయిలో జరిగే పీజీఆర్ఎస్‌కు కనీసం 50 దరఖాస్తులు కూడా రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆత్మకూరు మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెచ్చె ర్వు చెంచులు గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు కోరగా అటవీ, ఐడీటీఏ అధికారులతో సమీక్షించి నిర్ణయిస్తామన్నారు. అదేక్రమంలో గూడెంవాసులను మరోచోటికి తరలించమని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. ఎరువుల పంపిణీలో అవకతవకలకు చోటు లేకుం డా చూడాలని తెలిపారు. ఇరుకైన గదుల్లో పీజీఆర్ఎస్ చేపట్టడం వల్ల అక్కడికి వచ్చిన జనం తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. సమావేశంలో ఆర్డీవో నాగజ్యోతి, ఇన్‌చార్జి ఏడీఏ హేమలత, తహసీల్దార్ రత్నరాధిక ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నంద్యాలలో పీజీఆర్ఎస్‌కు 289 అర్జీలు

నంద్యాల ఎడ్యుకేషన్: కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన 289 అర్జీలను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్‌లు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టి గడువులోగా పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



వెండి అలంకరణలో స్వామివారి మూలవిరాట్

కౌతాళం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాల్లో భాగంగా రెండో సోమవారం స్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయ క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. భక్తులు ఆదివారం రాత్రి నుంచే దర్శించుకునేందుకు బారులు దీరారు. రాత్రి విరామం లేకుండా దర్శన ఏర్పాట్లు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. క్యూలైన్లు నిండిపోయి గంటల తరబడి దర్శనానికి సమయం పట్టింది. ఎల్ఎల్‌సీ కాలువలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. వాహనాల రద్దీతో అన్ని రూట్లలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.



పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

మోడల్ జంక్షన్

- అసౌకర్యాల్లో నంద్యాల రైల్వేస్టేషన్
- దెబ్బతిన్న బల్లలు
- ఒక్కటే మరుగుదొడ్డి
- తాగునీటికి సైతం తిప్పలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



నిరుపయోగంగా తాగునీటి కొళాయి

నంద్యాల రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎంపికైన మోడల్ రైల్వేస్టేషన్లలో నంద్యాల ఒకటి. ఈ జంక్షన్ మీదుగా నిత్యం దాదాపు 22 ఎక్స్‌ప్రెస్, 2 ప్యాసింజర్, 26 గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు దాదాపు 5000 మంది ఈస్టేషన్ నుంచి ప్రయాణిస్తుంటారు. జిల్లాలో అతిపెద్ద జంక్షన్ అప్పటికీ అసౌకర్యాలు నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'అమృత్‌సర్ భారత్' లో భాగంగా రూ.21 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు చేస్తున్నప్పటికీ ఇంకా మరుగుదొడ్లు, తాగునీటి కొళాయిలు, బల్లలు, డోర్లు అసౌకర్యంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్ మీదుగా వెళ్లే అన్నిరైళ్లు, నంద్యాల నుంచి వెళ్లే డెమోరైళ్లు కొన్నిచోట్ల ఆపడం లేదని ఆరోపణలున్నాయి. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

అసౌకర్యాలు ఇవే..

● స్టేషన్ ఆవరణలోని శాకాహార భోజనాలయం డోర్ సగం విరిగింది. దీంతో భోజన సమయంలో కుక్కలు గదిలోకి వస్తున్నాయి. చిన్నపిల్లలు భయపడుతున్నారని, భోజనం చేసేందుకు ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● స్టేషన్ మొత్తం మీద ప్రయాణికులకు ఒక్కటే మరుగుదొడ్డి ఉంది. అది కూడా వెయిటింగ్‌హాల్‌లో ఉండటంతో చాలా మందికి తెలియక బయట డబ్బులు పెట్టి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా అధికారులు మరుగుదొడ్లు, స్నానపుగదులు నిర్మించాలని కోరుతున్నారు.

● తాగునీటి కొళాయిల వద్ద శుభ్రం చేయకపోవడంతో అన్నం, తినుబండారాలు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు నీరు తాగేందుకు అవస్థలు పడుతున్నారు. వాటి ఆవరణలో కూర్చోలేకపోతున్నారు.

● స్టేషను ఆవరణలోని కొన్నిబల్లలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులు ఎక్కువగా ఉన్న సమయంలో బల్లలు సరిపడక నిల్చోని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ప్లాట్‌ఫాం ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్యలు పరిష్కరిస్తాం

ఇక్కడ ఆగాల్సిన ప్రతి రైలు ఆపుతున్నాం. నంద్యాల నుంచి బయలుదేరే డెమో రైళ్లు ఆగాల్సిన చోటంతా ఆగుతున్నాయి. స్టేషన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం తాగునీటి కొళాయి వద్ద దుర్వాసన రాకుండా శుభ్రం చేయిస్తాం. బల్లలు, ప్లాట్‌ఫాం ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయిస్తాం.

● నరసింహులు, స్టేషన్ మాస్టర్, నంద్యాల



దెబ్బ తిన్న బల్ల

శ్రీశైలం నుంచి అన్యమతస్థులను తరలించాలి

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- మహానంది క్షేత్రంలో ప్రత్యేక పూజలు
- ఘన స్వాగతం పలికిన ఆలయ అధికారులు



పూజలు నిర్వహించి వస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

మహానంది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో వ్యాపారాలు చేస్తున్న అన్యమతస్థులను దేవదాయశాఖ అధికారులు గుర్తించి ఇతర ప్రాంతాలకు తరలించాలని గోషామహల్(తెలంగాణ) ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సోమవారం సాయంత్రం మహానంది క్షేత్రంలో ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలంలో హిందూయేతరులను గుర్తించి క్షేత్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. దీన్ని సీఎం చంద్రబాబునాయిడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. మహానందిలో కుల రాజకీయాలు చేయకుండా భక్తుల వసతి కల్పనకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, పసుపుల సుబ్బారెడ్డి, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి: ఫుడ్ సేఫ్టీ అధికారి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల అమ్మకాల్లో, తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ సూచించారు. సోమవారం నగరంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, టిఫిన్ పార్శిల్స్ పాయింట్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా పదార్థాల తయారీకి వ్యాపారులు ఉపయోగిస్తున్న ముడిసరుకు, నూనెలను పరిశీలించారు. ఆహార విక్రయ ప్రదేశాల్లో పరిశుభ్రతను, మిగులు, వ్యర్థ పదార్థాలను తొలగింపు చర్యలను ఆయా విక్రయశాలల్లోని సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల అమ్మకాల్లో వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే అమ్మకాలు చేయాలని, అందుకు విరుద్ధంగా అమ్మకాలు చేసే వారిపై చర్యలతో పాటూ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

కేజీబీవీల్లో విజయపథం

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో వినూత్న విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు ఎనిమిది నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు నిర్వహించే షెడ్యూల్‌ను ప్రవేశ పెట్టారు. గత నెల (జూలై) 15న ఈవిధానాన్ని ప్రారంభించారు. తరగతి గదుల్లో కాకుండా ఆరుబయట చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీఅవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు.



చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు పెట్టనున్నారు. చదువుపై దృష్టి సారించే చర్యల్లో భాగంగా స్టడీఅవర్స్, స్లిప్‌టెస్టుల నిర్వహణ చేపట్టాలని కేజీబీవీ డైరెక్టర్ ఇటీవల షెడ్యూల్ జారీ చేశారు. ఇందులో భాగంగా రాత్రి 10 గంటల వరకు స్టడీఅవర్ అమలు చేయాలని పేర్కొన్నారు. దీనికి 'విజయపథం' అని పేరు పెట్టారు. ఆ మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు తిరిగి స్టడీఅవర్‌ను ప్రారంభించి ఆరు గంటలకు స్లిప్‌టెస్టు నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈమేరకు దీనిని గత నెల (జూలై) 15వ తేదీ నుంచి ప్రారంభించారు.



కేజీబీవీలో ఉదయం 6 గంటలకు స్లిప్ టెస్టులు రాస్తున్న విద్యార్థినులు

5,740 మందికి పైగా విద్యార్థినులు

జిల్లాలోని కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సెక్షన్‌కు 40 మంది చొప్పున బాలికలకు ప్రవేశం కల్పిస్తారు. ఈఏడాది ప్రవేశాల ప్రక్రియ పూర్తి కావడంతో నంద్యాల జిల్లాలోని 27 కేజీబీవీల్లో ఇంటర్ వరకు 5,740 మందికి పైగా బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. చాగలమర్రి కేజీబీవీ, కళాశాలలో 269 మంది బాలికలు ఉన్నారు. 6, 7 తరగతులకు రోజు విడిచి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు మంగళవారం నుంచి శనివారం వరకు రోజు టెస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు.

- ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు స్లిప్ టెస్టులు
- వారానికి ఐదు రోజులు పరీక్షల నిర్వహణ
- ప్రతి రోజు స్టడీ అవర్స్
- నూతన విద్యా బోధనకు శ్రీకారం

విద్యాలయ ఆవరణలోనే ఆరు బయట..

ప్రతి రోజు తెల్లవారుజామున స్టడీ అవర్, స్లిప్ టెస్టులను విద్యాలయం ఆవరణలోనే విద్యార్థినులంతా కింద కూర్చొని పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. తరగతి గదుల్లో కాకుండా ఆరుబయట చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీఅవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆరుబయట నిర్వహించిన స్లిప్‌టెస్టులకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా వాటికి మంచి స్పందన లభించింది. ఎస్‌వో స్వప్న మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా ఏపీసీ ఆదేశాల మేరకు వినూత్న బోధన నిర్వహిస్తున్నామన్నారు. స్టడీ అవర్, స్లిప్‌టెస్టులను నిర్వహించడంతో మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రణాళికను కేజీబీవీ, కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు.

వీబీఆర్‌కు జలకళ

- ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- నీటినిల్వలు 16.32 టీఎంసీలు
- జలాశయం వద్ద సందర్శకుల తాకిడి

ఆత్మకూరు/వెలుగోడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. తెలుగుగంగ పథకంలో భాగమైన జలాశయానికి కొన్నిరోజులుగా నిరంతరంగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి నీటివిడుదల కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే ఎగువ రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరడంతో జూలై 6 నుంచి వీబీఆర్‌కు నీటివిడుదలను ప్రారంభించారు. అప్పటినుంచి నేటి వరకు నిరంతరం వీబీఆర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌లోకి గరిష్ఠస్థాయికి చేరువలో నీటినిల్వలు నమోదు కావడం విశేషంగా చెప్పవచ్చు. శ్రీశైల జలాశయం బ్యాక్‌వాటర్ తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు చేర్చడంతో జలాశయం గరిష్ఠ నీటిసామర్థ్యం 16.95టీఎంసీల గానూ సోమవారం సాయంత్రానికి 16.32టీఎంసీల నీటినిల్వలు నమోదయ్యాయి. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 14,600వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా వీబీఆర్ నుంచి మద్రాస్ ప్రధాన కాల్వకు 5,200 క్యూసెక్కులు, గాలేరు నదికి 9వేలు క్యూసెక్కులు, వన్‌ఆర్ కాల్వకు 60 క్యూసెక్కులు, వన్‌ఎల్ కాల్వకు 40 క్యూసెక్కులు, సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, నంద్యాల, ఆత్మకూరు, వెలుగోడు తాగునీటి పథకాలకు 20 క్యూసెక్కుల చొప్పున మొత్తం 14,590 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయాన్ని వీక్షించేందుకు సందర్శకులు అధికంగా తరలివస్తున్నారు. వాహనాలను నేరుగా మట్టికట్టపైకి తీసుకెళ్లి అక్కడ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.



జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయం



వీబీఆర్ వద్ద సందర్శకుల తాకిడి



స్పిల్‌వే ద్వారా గాలేరు నదికి జరుగుతున్న నీటివిడుదల

ప్రణాళికాబద్ధంగా నీటి నిల్వలు..

వెలుగోడు జలాశయానికి నెల రోజులుగా వరద కొనసాగుతోంది. జలాశయంలోకి చేరే ఇన్‌ఫ్లో బట్టి ప్రాజెక్ట్‌లో నీటినిల్వలు నమోదు చేస్తున్నాం. వరద ప్రవాహంతో పాటు వర్షాల నీరు జలాశయంలో వచ్చి చేరితే గరిష్ఠ స్థాయి కంటే అధికంగా నీటినిల్వలు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలతో నీటినిల్వలు నమోదు చేస్తున్నాము. ఇన్‌ఫ్లోకు తగ్గట్లుగా ఔట్‌ఫ్లో నీటిని విడుదల చేస్తున్నాం.

- శివనాయక్, ఏఈఈ, తెలుగుగంగ పథకం, నంద్యాల

'అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ

- రచయిత అజీజ్‌కు అభినందనలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి దివంగత అల్లూరి సత్యనారాయణ రాజుపై రాసిన 'అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర' ఆంగ్ల అనువాద పుస్తకాన్ని సోమవారం రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆవిష్కరించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, అల్లూరి సత్యనారాయణ రాజు కుమారుడు జతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ రాజకీయ నాయకుడు అల్లూరి సత్యనారాయణ రాజు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పుస్తకరూపంలో తీసుకువచ్చిన రచయిత అజీజ్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు

సహకారంతోనే అభివృద్ధి

- వ్యవసాయ, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- కర్నూలు డీసీసీబీకి అభినందన
- ఉత్తమ సహకార సంఘాలకు అవార్డుల ప్రదానం

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతోనే ఏ వ్యవస్థ అయినా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) 62వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడలోని మాటినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు సీఈవో రామాంజనేయులుతో పాటు రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు సహకార సంఘాల చైర్మన్లకు అవార్డులు మంత్రి అందించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు మంత్రి చేతుల మీదుగా సంఘాల అధ్యక్షులు అవార్డును అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లాలోని కడిమిట్ల, కొండాపురం, పాములపాడు సంఘాలు, అదేవిధంగా 2024-25 ఏడాదికి గానూ పోలూరు, మద్దికెర, సి.బెళగల్ సంఘాలను ఎంపిక చేశారు. ఆయా సంఘాలు ఈప్రోత్సాహకాన్ని ఒక ఉత్తేజిత ప్రక్రియగా తీసుకుని రైతు సోదరులకు సేవలందించి వారి మన్ననలు పొందాలని, మిగిలిన సంఘాలు కూడా ఇదే స్ఫూర్తితో వారి పనితీరు మెరుగుపరుచుకుని జిల్లాకు మంచి పేరు తీసుకోవాలని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు.



అవార్డులు అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో రామాంజనేయులు

చట్టసభల్లో మహిళలకు పెద్దపీట

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి పెద్దపీట వేసిన ఘనత భారతీయ జనతా పార్టీదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇండియన్ విజిటర్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఏపీ నుంచి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూషారెడ్డిని భారత ప్రతినిధిగా ఎంపిక చేసిన సందర్భంగా సోమవారం స్థానిక మౌర్యఇన్ హోటల్‌లోని పరిణయ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ అమెరికా డిపార్టుమెంట్ ఆఫ్ స్టేట్ నిర్వహిస్తున్న ఐవీఎల్‌పీ కార్యక్రమం భావి ప్రపంచ నాయకుల మధ్య పరస్పర అవగాహనను భావాజాలు మార్పి డికి ప్రధాన దీపికగా నిలుస్తుందన్నారు. అమెరికా ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎప్పుడు ఏం మాట్లాడుతారో అర్థం కాద న్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవాలయాలను విధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. దేవాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాల న్నారు. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌ను మళ్లీ తెరమీదకు తెస్తామన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మహిళల సాధికారతకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. డాక్టర్ వినూషారెడ్డి మాట్లాడుతూ ఐవీఎల్‌పీకి ఇండియా నుంచి తనను బీజేపీ ఎంపిక చేయడం పట్ల కేంద్ర, రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, పురుషోత్తంరెడ్డి, బీజేపీ మహిళా ప్రతినిధులు గీతామాధురి, మాలతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

అక్రమార్కులు తప్పించుకోలేరు

- ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమారులెవరూ తప్పించుకోలేరని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఘాటుగా విమర్శించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలో 2008లో మంజూరై 2009లో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో రూ. 44కోట్లతో ప్రారంభమై నేటికి అసంపూర్తిగా ఉన్న యూజీడీ(అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ)లో జరిగిన అక్రమాలపై విచారణ కమిటీ వేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై విచారణకు వైసీపీ నాయకులే పరోక్షంగా కోరుతున్నారన్నారు. వైసీపీకి చెందిన నాయకులు పట్టణంలో యుజీడీ పూర్తి చేశామని, ఇందులో అవినీతి అక్రమాలు జరిగాయని, ప్రజాప్రతినిధి మేల్కోవాలని, విచారణచేయాలని ఓ వీడియోలో చెప్పారన్నారు. వారు కోరిన విధంగా త్వరలో విచారణ చేయిస్తామన్నారు. 2014లో తాను ఎమ్మెల్యేగా వచ్చిననాటికి 75శాతం పూర్తి అయిందని రూ. 44 కోట్లలో రూ. 36.60 కోట్లు ఖర్చు చేసినట్లు నిధులు మంజూరు చేశారన్నారు. నిధులు ఖర్చు అయినా పనులు మాత్రం పూర్తికాలేదన్నారు. పనులు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయోనని పరిశీలించి కాంట్రాక్టర్‌తో మట్లాడి 2019నాటికి 95శాతం పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆ తరువాత ఎమ్మెల్యేగా వచ్చిన చెన్నకేవరెడ్డి ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చిన అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి యూజీడీ పూర్తి చేసేందుకు రూ. 26కోట్లు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారన్నారు. మరి పథకం పూర్తి అయివుంటే ఎందుకు నిధులు ఇవ్వాలని కోరారో వైసీపీ నాయకులు చెప్పాలన్నారు. వాస్తవంగా రూ.16 కోట్లు అవసరమని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. తన తండ్రి బీవీ మోహన్ రెడ్డి కల కర్నూలు, మంత్రాలయం రైల్వేలైన్‌కు కేంద్రం చేత డీపీఆర్ ఆమోదింపజేశానన్నారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి రూ. 200కోట్లతో బైపాస్ రోడ్డు కూడా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరానన్నారు. ఇది త్వరలో వస్తుందని, ఆదోని, కోడుమూరు రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరానన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అవి త్వరలో మంజూరు కానున్నాయన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, నాయకులు మాజీ సర్పంచ్ కాశీం వలి, తిమ్మారెడ్డి, రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, కౌన్సిలర్ రామదాసు గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

8 నుంచి రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 8 నుంచి 14వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం స్థానిక గురునివాస్‌లో ఉత్సవాలపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమై 14వ తేదీ సర్వ సమర్పణ సేవతో ఉత్సవాలు ముగింపు పలుకుతున్నట్లు తెలిపారు. ఆరాధనలో ముఖ్యమైన 10న పూర్వా రాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తరారాధన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని, ఈ మూడు రోజుల పాటు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నట్లు తెలిపారు. పూర్వారాధనలో టీటీడీ నుంచి, తమిళనాడు శ్రీరంగం, కంచి మఠం నుంచి రాఘవేంద్రస్వామికి పట్టువస్త్రాల సమర్పిస్తారని తెలిపారు. 11న మధ్యారాధనలో మధ్యాహ్నం బంగారు రథంపై రాఘవేంద్రస్వామి ఊరేగింపు, బృందావనం నాలుగు వైపుల అలంకరణ ప్రత్యేకంగా ఉంటుందన్నారు. 12న మహారథోత్సవంలో భాగంగా రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని నవరత్నాల కవచంతో అలంకరిస్తామన్నారు. 2025 ఏడాదిలో రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులకు తమిళనాడు చెందిన రామేశ్వరంలోని సామాజికవేత్త విఠల్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి చెందిన ప్రముఖ జయరామ్ శుక్లాకు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2025 అవార్డుకు ఎంపిక చేశామని, ఈ నెల 10న యోగేంద్ర కళామండపంలో పురస్కారం అందజేస్తామన్నారు. బెంగుళూరుకు చెందిన ప్రకాష్ శెట్టి అనే భక్తుడు దాదాపు రూ.9 కోట్లతో సొంతంగా నిర్మించిన పుష్కరిణి శాస్త్రోక్తంగా ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

కోసిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన దుద్ది లక్ష్మి (48) హత్య కేసులో ఆమె భర్తను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. నరసింహులు మద్యానికి బానిసై నిత్యం భార్యను వేధించేవాడు. అందులో భాగంగానే గత నెల 30న సాయంత్రం 5.30 గంటల సమయంలో భార్యతో గొడవపడి ఇంట్లో ఉన్న రోకలితో తలపై బాది పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మి మృతి చెందింది. లక్ష్మి కుమారుడు హంశేనీ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఊరి చివర ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిందితున్ని అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన రోకలిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు

సెల్‌ఫోన్ దొంగలు దొరికారు

- ముఠా అరెస్టు.. 59 సెల్‌ఫోన్లు స్వాధీనం

కోడుమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, బస్‌స్టాండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను దొంగలించే ముఠాను సోమవారం కోడుమూరు పోలీసులు పట్టుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఐ తబ్రేజ్ వివరాలు వెల్లడించారు. డోన్ మండలం చిగురుమాన్‌పేట గ్రామానికి చెందిన ఎరుకలి శశికుమార్, శ్రీనుతో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురు కలిసి కొంత కాలంగా ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలల్లో సెల్‌ఫోన్లు దొంగలించారు. మూడు రోజు కిందట కోడుమూరులో మూడు సెల్‌ఫోన్లు దొంగలించారు. ఆ సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వాళ్లకు అమ్మి, వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. సెల్‌ఫోన్లు దొంగలించేందుకు కోడుమూరుకు వచ్చి కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ వద్ద తిరుగుతు న్నారు. అనుమానంవచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించి ఆనలుగురు సెల్‌ఫోన్ దొంగలని నిర్ధారించాం. వాళ్ల నుంచి 59సెల్‌ఫోన్లును స్వాధీన పరుచుకున్నాం. నిందితులు దొంగలించిన సెల్‌ఫోన్లలో ఎక్కువ శాతం కర్ణాటక రాష్ట్రంకు చెందిన వాళ్లవిగా గుర్తించాం. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వాళ్లను ఇక్కడికి పిలిపించి సెల్‌ఫోన్లను అందిస్తామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పెసలదిన్నె గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. పెసలదిన్నెకి చెందిన నరసింహులు కుమారుడు కృష్ణమూర్తి (34) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండెకరాల సొంత పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి, వేరుశనగ, పత్తిని సాగుచేశాడు. పత్తి పంటకు రాత్రి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో ఉన్న బోరును ఆన్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కి ంపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా రామకృష్ణ విగతజీవిగా పడిఉన్నాడు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సరోజ, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుందూనదిలో మృతదేహం లభ్యం

ఉయ్యాలవాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సమీపంలోని కుందూనది వద్ద మృతదేహం లభ్యం అయ్యింది. వివరాలలోకి వెళ్తే ఈ నెల 1న బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ముర్తుజా వలిహుశేన్(22) నదిలోకి దిగి తన ఆటో శుభ్రం చేస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి గల్లంతయ్యాడు. పోలీసులు, ఎండీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి కుందూనదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం ఉయ్యాలవాడ మండలంలోని బోడెమ్మనూరు గ్రామ కుందూనది వంతెన వద్ద మృతదేహాన్ని గుర్తించారు. బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు.

నేడు జర్నలిస్టుల ధర్నా


కర్నూలు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నటు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సభ్యుడు కె. నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, యాక్సిడెంటల్ ఇన్సూరెన్సు పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, హెల్త్ కార్డు సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

క్లాసులు ఫుల్

నో అడ్మిషన్లు అంటూ బోర్డు

విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. మధ్యాహ్న భోజనంలో సమూలమైన మార్పులు చేసి, సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం, 'తల్లికి వందనం' కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా, అంతమందికి రూ.15వేలు జమ చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. క్రీడలు, ఎన్‌సీసీకి ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు లేవంటూ నోటీసు బోర్డు పెట్టేశారు.

- నెహ్రూ మెమోరియల్ పాఠశాలకు విద్యార్థుల తాకిడి
- కిక్కిరిసిన తరగతి గదులు
- 'ఎక్స్' వేదికగా మంత్రి నారా లోకేశ్ అభినందన





నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో సీట్లు లేవని నోటీసు బోర్డు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. బడి తెరిచిన నాటి నుంచి ప్రతి రోజు సిఫార్సు లేఖలతో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కడుతున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్లు లేవంటూ నోటీసు బోర్డు పెట్టారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ ద్వారా హెడ్‌మాస్టర్ ఫయాజుద్దీన్‌ను, ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన హెచ్‌ఎం ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులను ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు అంటూ.. మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' ద్వారా అభినందనలు తెలిపారు.

ఆరు నుంచి పదో తరగతి వరకు..

ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠశాలల్లో 1725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కోగదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. తరగతి గదులు చాలక ఉపాధ్యాయులు ఇక కూర్చోడానికి స్థలం లేదని, మిమ్మల్ని బడిలో చేర్చుకోలేమంటూ నోటీసు బోర్డు పెట్టేశారు. ఆ పాఠశాలకు ఏటా పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతుండటంతో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో బోధన చేస్తుండటం, ఎన్‌సీసీ, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుండటంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అదనపు తరగతి గదులు నిర్మిస్తే...

కేవలం 20 గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థులకు ఏమాత్రం సరిపోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' కింద అదనపు తరగతి గదులు 12 నిర్మించినా, అవి మొండిగోడలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే, పాఠశాల మరింత అభివృద్ధితో పాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని తల్లిదండ్రులు అంటున్నారు.

450 మందికి అడ్మిషన్

2025-26 విద్యా సంవత్సరానికి 450 మంది చేరారు. వీరిలో 450 మందికి అడ్మిషన్ నెంబర్ ఇవ్వగా.. 25 మందికి అడ్మిషన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంది. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులున్నారు. తరగతి గదిల్లో కూర్చోడానికి కూడా స్థలం లేక, కొంతమంది విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం.. ఉపాధ్యాయుల కృషి..



ప్రభుత్వ పాఠశాలలకు కల్పిస్తున్న ప్రోత్సాహంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగింది. దీంతో తమ పాఠశాలలో చేర్పేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. ఉపాధ్యాయులు వినూత్న బోధనతో ఆకట్టుకుంటున్నారు. తల్లిదండ్రులకు మన్నించాలని చెబుతూనే ఉన్నా పాఠశాలకు క్యూ కడుతున్నారు. **- ఫయాజుద్దీన్, హెచ్‌ఎం, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని**

రేషన్‌కార్డు కోసం వేలిముద్ర వేస్తే..

- ఎనిమిది ఏళ్ల క్రితం తప్పిపోయిన బాలుడి ఆచూకీ గుర్తింపు
- రేషన్‌కార్డు గుర్తింపుతో తల్లిదండ్రుల చెంతకు



ఉయ్యూరులో బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగింత

ఆదోని, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు రేషన్ కార్డు కోసం వేలిముద్ర వేసేందుకు రావడంతో అతడి ఆచూకీ లభ్యమైంది. అతడు ఉయ్యూరు పట్టణంలోని శిరీష రిహాబిలిటేషన్ సంస్థలో ఆశ్రయం పొందుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి చొరవతో ఆ యువకుడిని తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాలు.. ఆదోనిలోని శివశంకర్‌నగర్‌కు చెందిన వడ్డే నాగరాజు, లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. అందులో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. నాలుగో కొడుకు శ్రీకాంత్ 2018లో తప్పిపోయాడు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు అతడి వయస్సు 12 ఏళ్లు. మతిస్థిమితం లేని అతడు ఎలాగో అలా ఆదోని రైల్వేస్టేషన్ నుంచి రైలులో విజయవాడకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్లో మతిస్థిమితం లేక తిరుగుతున్న అతడిని విజయవాడ రైల్వే పోలీసులు గుర్తించి అక్కడి చైల్డ్‌కేర్ అధికారులకు అప్పగించారు. వారు కలెక్టర్ ఆదేశాలతో ఉయ్యూరులోని శిరీష రిహాబిలిటేషన్ సంస్థకు అప్పగించారు. అతడు టీబీతో బాధపడుతున్నట్లు గుర్తించి గుంటూరులోని టీబీ ఆసుపత్రిలో చేర్చారు. మూడునెలల పాటు చికిత్స అందించి ఆరోగ్యంగా తయారయ్యాక శ్రీకాంత్‌ను అక్కడే సంస్థ ఆలనాపాలనా చూశారు. రేషన్‌కార్డు చేయించి పింఛన్‌కు దరఖాస్తు చేసుకుందామన్న ఉద్దేశంతో రేషన్‌కార్డు కోసం వేలిముద్ర వేయించారు. అప్పటికే రేషన్ కార్డు ఉందని ఎర్రర్ అని రావడంతో మరిన్ని వివరాలు సేకరించారు. రేషన్‌కార్డు సాయంతో తల్లిదండ్రుల వివరాలను రిహాబిలిటేషన్ సంస్థ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్ నుంచి ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసు లు ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తప్పిపోయిన తమ కుమారుడు ఉయ్యూరులోని రిహాబిలిటేషన్ సంస్థలో ఉన్నాడని తెలుసుకొని అక్కడికి వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆసంస్థ వారు తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఎనిమిదేళ్ల తర్వాత తమ బిడ్డను కలుసుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చేరదీసిన ఆ సంస్థకు, టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మిరప, టమోటా పంటల ధ్వంసం

- సుమారు 2లక్షలు నష్టపోయామంటున్న రైతులు



దుండగులు ధ్వంసం చేసిన పంట

పత్తికొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎకరా పొలంలో సాగుచేసిన మిరప, టమోటా పంట లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టపోయామని పందికోన గ్రామానికి చెందిన రైతులు మద్దినేని కదిరప్ప, మద్దినేని వెంకటేశ్వర్లు ఆరోపించారు. తమకున్న ఎకరా పొలంలో డ్రిప్‌పైపులు వేసుకుని మిరప, టమోటా పంటలు సాగుచేశామన్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కోతకు వచ్చిన మిరప, టమోటా పంటను తెంపడంతో పాటు డ్రిప్‌పైపులకు నిప్పుపెట్టారని వాపోయారు. పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశామన్నారు.

నిందితుడికి రిమాండ్

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లదొడ్డి సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు ఠాగూర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అతడిని డీఎస్పీ భార్గవి ముందు పరిచి ఆలూరు కోర్టుకు తరలించారు. ఆలూరు కోర్టు న్యాయాధికారి నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బిర్లాకాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ కృష్ణాజీరావు, ప్రచార కార్యదర్శి రాంబాబు, మనోహర్‌రెడ్డిలతో కలిసి ఈనెల 18, 19 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టబోయే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో 544 మంది లోక్‌సభ సభ్యుల్లో 280 మంది బీసీలు ఉండాలి, కానీ కేవలం 110 మంది మాత్రమే ఉన్నారన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, 50 వేల కోట్లతో బీసీలకు ప్రత్యేక సబ్ ప్లాన్, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో వీజీ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఓ ఉద్యోగి అనుచరులపై ఫిర్యాదు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలన గాడి తప్పిందని, ఇటీవల బదిలీ అయిన ఓ సీనియర్ అసిస్టెంట్ కనుసైగల్లో తన అనుచరు లకు ఆర్థిక లావాదేవీల సీట్లలో కొనసాగుతున్నారని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు కే.మాధవస్వామి సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి ఒకే సీటులో విధులు నిర్వ హించిన సీనియర్ అసిస్టెంట్ బదిలీ అయినా తర్వాత అధికారులు ఎంతో కీలకమైన ఈ సీటును తన అనుచరులకే ఇచ్చారని, అలాగే ఓ బినామి ఉద్యోగికి ఆరోగ్యశ్రీ, సదరం, ఆర్థిక లావాదేవిల వ్యవహా రాలన్నీ అతని పేరు మీద జరుగుతున్నాయని, రెగ్యులర్ ఉద్యోగు లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. తక్షణమే కలెక్టర్ బదిలీ అయిన సీనియర్ అసిస్టెట్ అనుచరుల సీట్లను మార్చాలని, సీనియార్టీ ప్రాతిపాదికన సీట్లు ఇతరులకు కేటాయించాలని కోరారు.

అబార్షన్ కేసులో నిందితుల అరెస్టు

నందికొట్కూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అబార్షన్ కేసులో పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మ ణ్యం తెలిపారు. వివరాలు.. పగిడ్యాల మండలం బీరవోలుకి చెందిన శ్రీవాణికి లింగనిర్ధారణ పరీక్షలు చేయించిన భర్త లోకేష్, అత్త నాగేంద్రమ్మ, నందికొట్కూరులోని ఆర్‌ఎంపీ డా.గీతారాణి సహకారంతో గర్భస్థ లింగ నిర్ధారణ కోసం కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లోని స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేపించి గర్భంలో ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకున్నారు. జూలై 29న పట్టణంలోని వీర భద్ర క్లినిక్‌లో ఆర్‌ఎంపీ గీతారాణితో అబార్షన్ చేయించారు. మరుసటి రోజు 30వ తేదీ ఉదయం శ్రీవాణికి తీవ్ర రక్తస్రావమై చనిపోయింది. ఈ ఘటనపై శ్రీవాణి తల్లి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు నిందితులు లోకేశ్, నాగేంద్రమ్మ, ఆర్‌ఎంపీ డాక్టరు గీతారాణి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. కర్నూలులోని రక్షా హాస్పిటల్‌లోని స్కానింగ్ టెక్నీషియన్ శేఖర్, అదే హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రక్ష హాస్పిటల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు

కర్నూలు హాస్పిటల్: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలుకు చెందిన గర్భిణికి ఓ ఆర్‌ఎంపీ అబార్షన్ చేయగా.. వికటించి గర్భిణి మృతి చెందిన విషయం విధితమే. గర్భిణికి స్కానింగ్ చేసింది కర్నూలులోని రక్ష హాస్పిటల్ అని, చర్యలు తీసుకోవాలని నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ రెండు రోజుల క్రితం కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు లేఖ రాశారు. శనివారం కర్నూలు డీఎంహెచ్‌వో రక్ష హాస్పిటల్‌కు వెళ్లగా సిబ్బంది ఎవరూ లేకపోవడంతో స్టోర్ రూమ్‌కు తాళం వేసి వెనుదిరిగారు. విచారణ చేయ డానికి యాజమాన్యం ఎవరూ లేకపోవడం, సమాచారం ఇవ్వకపో వడంతో ఆదివారం డీఐవో డా.నాగప్ర సాద్, డెమో శ్రీనివాసులుశెట్టి సిబ్బందితో రక్ష హాస్పిటల్‌కు షోకాజ్ నోటీసులు అతికించారు. ఆ తర్వాత సిబ్బందికి నోటీసును అందజేశారు. రెండు రోజుల్లో నోటీస్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. గర్భిణి మరణించి ఆరు రోజులవు తున్నా కర్నూలు వైద్యాధికారులు విచారణను వేగవంతంగా జరిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రక్ష హాస్పిటల్‌లో చట్టవిరుద్ధంగా స్కానింగ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చినా ఎందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించడం లేదని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆ ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ మిషన్ లేనప్పుడు గర్భిణికి స్కానింగ్ ఎలా చేశారు..? ఎవరు చేశారు..? అన్నది కర్నూలు వైద్యఆరోగ్య శాఖ అధికారులు విచారణ వేగవంతం చేయాలని, ఇందులో నిజనిజాలు బహిరంగ పరచాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నులి పురుగుల నివారణతో పరిపూర్ణ ఆరోగ్యం

షడ్రక్ సేవలు స్ఫూర్తిదాయకం



షడ్రక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎంకి షడ్రక్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఆపార్టీ నాయకులు ఏసురత్నం, సుధాకర్, రణధీర్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో షడ్రక్ పటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, నాగేశ్వరరావు, సురేంద్ర, వీరన్న మాబాషా, శ్రీనివాసులు, ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



నందికొట్కూరులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, రామ్‌నాయక్, రణధీర్, మాబ బాషా, వీరన్నలు పిలుపునిచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం నందు ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ చార్జీలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావవు, శివుడు, కృష్ణమోహన్, ఆశీర్వాదం, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: స్మార్ట్ విద్యుత్ మీటర్ల అమలుకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొనాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ తాలుకా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు కాటిపోగు సోమన్న, షేక్షావలి, రామకృష్ణ, శ్రీనివాసులు, వడ్డె సుధాకర్, జిల్లా మహిళా నాయకురాలు ఎస్.బి.బి, లక్ష్మీదేవి, ముర్తుబి తదితరులు పాల్గొన్నారు.

●విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా మంగళవారం విద్యుత్ కార్యాలయం ముందు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మజీద్‌మియా, సీఐటీయూ టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

పాణ్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాణ్యం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కుమ్మరి రాముడు(75) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందాడు. పాణ్యం ఎంపీటీసీ రంగరమేష్, టీడీపీ నాయకులు రాంమోహన్ నాయుడు, రమణమూర్తి, సుబహన్, ప్రభాకర్, ఖాజా, మహేశ్, సుబ్బయ్య ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంజనీర్లకు కృత్రిమ మేధస్సు కీలకం

పాణ్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఇంజనీర్లకు కృత్రిమ మేధస్సు కీలకంగా మారుతుందని హైదరాబాదు బిర్లా సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సైంటిస్ట్ శేషగిరిరావు పేర్కొన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీఎస్ఈ ఆధ్వర్యంలో ఐదు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు భవిష్యత్తులో కృత్రిమ మేధాశక్తిపై ఆధారపడాల్సి వస్తోందని, అలాగే ఇది కీలకపాత్ర వహిస్తుందన్నారు. దీని ప్రాముఖ్యతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, హెచ్‌ఓడి డాక్టర్ సుబ్బారెడ్డి, డీన్ డాక్టర్ సునీల్ విజయనకుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ అయ్యావారయ్య, డీన్ డాక్టర్ రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంపీ శబరి



నంద్యాల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేతగా, కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రిగా పనిచేసిన పూసపాటి అశోక గజపతిరాజును గోవా నూతన గవర్నర్‌గా నియమించడం చాలా సంతోషంగా ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం ఆమె అశోక గజపతిరాజును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదే శ్‌కు చెందిన వ్యక్తి గోవాకు గవర్నర్ కావడం గర్వకారణమన్నారు.

చర్యలు తీసుకోవాలి

పగిడ్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని పాలకేంద్రం స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, సుందరాజు, తిరుపాలు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. గ్రామంలో వీఆర్వోతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పాములపాడు ఏపీవోగా జయంతి

పాములపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీవోగా సోమవారం జయంతి బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సంజామల నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చానని, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏపీవో అలివేలు మంగమ్మ నందికొట్కూరుకు బదిలీపై వెళ్లారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులుఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర

పాములపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని ఆదర్శ పాఠశా ల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పూజవైష్ణవి, సానియా, సమియా, తొమ్మిదో తరగతి చదువుతున్న చరణ్, రాజ్ నంద్యాలలో నిర్వహించిన జిల్లా సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎన్నికయ్యారని తెలిపారు. విద్యార్థులు క్రీడలలో రాణించడానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ సాయిక్రిష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.



నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణకు చిన్నారులకు అందించే అల్బెండజోల్ మాత్ర వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు దోహదపడుతోందని కలెక్టర్ రాజకుమారి గనియా అన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ అనంతరం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. నులిపురుగుల నిర్మూలనలలో భాగంగా 12న జాతీయ నులిపురుగల దినోత్సవాన్ని జరపనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మాత్రలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు.

● కలెక్టర్ రాజకుమారి

ప్రకృతి వ్యసాయంతోనే..

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో రైతు సాధిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ దిగుబడుల స్టాల్స్‌ను ఆమె సందర్శించారు. స్వయంగా డబ్బు చెల్లించి ఆకు కూరలను, నిమ్మకాయలను కొనుగోలు అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులతో కాసేపు ముచ్చటించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే దిగుబడులు ఆరోగ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే తొలిసారి జరిమానా రూ.10వేలు, రెండోసారి రూ.25వేలు ఉంటుందని హెచ్చరించారు. ప్లాసిక్‌కు బదులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నీడ్ బెస్ట్, డీస్కెన్సీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయండి

ప్రభుత్వం నిర్దేశించిన నీడ్ బెస్ట్, డిస్కెన్సీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. చాగలమర్రి, ఆత్మకూరు, ప్యాపిలీ, గడివేముల, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, డోన్ మండలాల్లో నీడ్ బెస్ట్, డీస్కెన్సీ సర్వే జిల్లాలో సగం కన్నా.. తక్కువ శాతం ఉందని అన్నారు. ఇందుకు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యే క దృష్టి సారించి మంగళవారం నాటికి సర్వే మెరుగుపడాలని అన్నారు.

ఆర్డీవో కార్యాలయ అవినీతిపై నిఘా

● దర్యాప్తు చేపడుతున్న ఇంటెలిజెన్స్ అధికారులు?

- డబ్బు వసూళ్లపై కలెక్టర్ ఆగ్రహం

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయ అడ్డాగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ఆత్మకూరు రెవెన్యూలో లంచావతారులు..! కథనంలో ఆశాఖలో కలకలం రేపింది. అక్కడ పనిచేస్తున్న ఓ కీలక ఉద్యోగి ప్రతి పనికి ధర నిర్ణయించి అవినీతి దుకాణంతో తెరవడంతో బాధితులతో పాటు అక్కడ పనిచేస్తున్న తోటి ఉద్యోగులు సైతం ఆవేదన చెందుతున్నారు. ఆర్డీవో కార్యాలయం కేంద్రంగా జరుగుతున్న ఈ అవినీతి, అక్రమాలపై ఇంటెలిజెన్స్ అధికారులు సైతం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలువురు బాధితులను వారు విచారించినట్లు సమాచారం. కాగా సోమవారం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా హాజరు హాజరయ్యారు. దీంతో ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఏసీడీ దాడులతో పాటు అక్కడ జరుగుతున్న వసూళ్ల వ్యవహారం గురించి మీడియా ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆమె ప్రభుత్వ సేవల విషయం డబ్బు వసూళ్లకు పాల్పడం సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజన వసతిని కల్పించిన పూర్వ విద్యార్థులు



కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు రామిరెడ్డి, శ్రీధర్, శ్రీహరి, సర్వోత్తమరెడ్డి ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డా.సునీత తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మాట్లాడుతూ రోజు డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థికి భోజన వసతికి తమ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కళాశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డా.ఎం.అన్వర్ హుస్సేన్, ఆర్టు శ్రీను, వేణుగోపాల్, భూపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 29న జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, పురుషులకు 10క్రీడాంశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎంఎన్‌వీ రాజు సోమవారం తెలిపారు. ఈ పోటీలు 3దశల్లో నిర్వహిస్తామన్నారు. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఆదేశించిందన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 5నుంచి 10వరకు, జోనల్ స్థాయి పోటీలు 11నుంచి 14వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు 16నుంచి 20వరకు నిర్వహిస్తామన్నారు. జోనల్‌స్థాయి పోటీలు తిరుపతిలో, రాష్ట్ర స్థాయి పోటీలు విజయవాడలో జరుగుతాయన్నారు. ఈ నెల 7న నంద్యాలలో పద్మావతినగర్‌లోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. స్టేడియం గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, 6న ఆర్జీఎం కాలేజీ మైదానంలో బాస్కెట్‌బాల్, 7న ఎస్పీజీ పాఠశాల మైదానంలో హాకీ, కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో అథ్లెటిక్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు 21సంవత్సరాలుండాలని, వివరాలకు 8712622576కు సంప్రదించాలని సూచించారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

మిడుతూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యో తి): వర్షం కోసం మండలంలోని బైరాపురం గ్రామంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు, పురుషులు గ్రామంలోని బొడ్రాయికి, శివాలయంలో శివలింగానికి జలాభిషేకం చేశారు. వర్షం కురిసి పంటలు పండాలని ఆంజనేయస్వామికి, నాగదేవతలకు, నవగ్రహాలకు పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు.

వెలుగోడులో గ్రామోత్సవం

వెలుగోడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి నూతన ఆలయం, విగ్రహ పునః ప్రతిష్ఠను పుస్కరించుకొని దేవతామూర్తులను భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఆలయం నుంచి గ్రామ శివార్లలోని 1ఆర్ తూమ్ వద్దకు దేవత మూర్తులను తీసుకెళ్లి కృష్ణాజలాలతో పవిత్ర స్నానాలు చేయించారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు పా టు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

వెలుగోడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు క్రమశిక్షణతో విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఎంఈవో బ్రహ్మం నాయక్ సూచించారు. సోమవారం వెలుగోడు పట్టణంలోని సీపీ నగర్ ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న నూర్ మొహిద్దీన్ బనగానపల్లెకు బదిలీ అయ్యారు. ఆయనకు ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాజేశ్‌కుమార్, ప్రముఖ నాయకులు నసురుల్లాఖాన్, టీడీపీ నాయకులు మొమిన్ రసూల్, హిదాయత్, సయ్యద్, బాషా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఆత్మకూరురూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుకుంద గ్రామంలో దాదాపు 150 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం నాయకులు సుధాకర్,మాబాషా, వీరన్న కలెక్టర్ రాజకుమారి గణియాను కోరారు. సోమవారం ఆత్మకూరులోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహిస్తు న్న అన్నప్రసాదవితరణ కోసం భక్తులు విరాళాలు అందజేశారు. సోమవారం ఒంగోలుకు చెందిన చెన్నారెడ్డి శ్రీనివాసరావు దంపతులు రూ. 1,01,116, మదనపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, సుమిత్ర దపంతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు దేవిక, సహాయ కార్యనిర్వహణాధికారి సతీష్‌కుమార్ దాతలకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో నిత్య కళారాధనలో భాగంగా సోమవారం విజయవాడ శ్రీకళాక్షేత్రడాన్స్‌అకాడమీ, వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళారాధన వద్ద కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా గణపతి కౌత్వం, మూషికవాహన, తాండవనృత్యం, ఓం నమశివాయ, శివతాండవం, భో.శంభో, మహాప్రాణదీపం తదితర గీతాలకు శ్వేత, కుందన, హేమ, దుర్గ,కావ్య, రచన, మోక్ష, మేఘన నృత్యప్రదర్శన చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని, ప్రభుత్వ విద్యాసంస్థలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. నంద్యాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర, విద్యా, వైజ్ఞానిక తరగతుల్లో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు శేషఫణి, భాస్కర్, వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇతర వ్యక్తులకు పాఠశాలల్లోకి ప్రవేశం లేదని ప్రభుత్వ చీకటి జీవో తెచ్చిందన్నారు. విద్యారంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జునైద్, రాజేశ్, రాంబాబు, రమణకుమార్, శంకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో పంటసాగుకు సరిపడా ఎరువులు అందించి, అన్నదాతలను ఆదుకోవాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి డిమాండ్ చేశారు. శిల్పా నివాసంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎరువుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం రాజకీయాలపైన, ప్రత్యర్థి నేతలపైన దృష్టి పెట్టడం సరికాదని, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలోని గోస్పాడు, నంద్యాల మండలాల్లో రైతులకు అందించాల్సిన యూరియాను టీడీపీ నాయకులు తమ గోడౌన్లలో నిల్వ చేసుకుంటున్నారన్నారు. కూటమి నాయకులకు చెప్పిన వారికే అధికారులు యూరియా బస్తాలు అందిస్తున్నారని ఆరోపించారు. అనంతరం బనగానపల్లి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, గంగుల బీజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి కలెక్టరేట్‌లో జేసీ విష్ణు చరణ్‌కు పలు సమస్యలపై అర్జీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, గోస్పాడు మండలం సొసైటీ మాజీ ఛైర్మన్ రామసుబ్బారెడ్డి, ఎం.కృష్ణాపురం సర్పంచి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు పోరాడుతూనే ఉంటామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కానాల గ్రామంలో బాబు షూరిటి .. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలనే నెరవేర్చకుండా ప్రభుత్వం వైసీపీ నేతలపై కక్ష సాదింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, విజయశేఖర్‌రెడ్డి. బసవేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


పగిడ్యాలలో దోమల నివారణకు చర్యలు

పగిడ్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల దేవానగర్ కాలనీలో దోమల నివారణకు గ్రామ సర్పంచ్ శేషన్న, టీడీపీ నాయకుడు పుల్యాల రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం దోమల మందును పిచికారి చేయించారు. వర్షాకాలం కావడంతో కాలనీలోని మురుగు కాలువలను శుభ్రం చేయించి దోమలు నిల్వలేకుండా దోమల మందును పిచికారి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వమే బీమా చెల్లించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పంటలకు సరైన గిట్టుబాటు లేక తీవ్రంగా నష్టపోతున్నారని కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పంటలకు బీమా చెల్లించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోరారు. ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు పడడంతో సేద్యాలు చేసి విత్తనాలు వేసిన రైతులు జూన్, జులైలో వర్షాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ సమయంలో రైతులను ప్రభుత్వాలే ఆదుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలకు కోట్ల రూపాయల రాయితీలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు దేశానికి అన్నదాతలైన రైతులపై భారం మోపడం తగదన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలతో చర్చించి అన్ని రకాల పంటలకు బీమా వర్తింపచేసే విధంగా కృషి చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకు విద్యారంగ సమస్యలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం విద్యా రంగ సమస్యలపై నిర్లక్ష్య ధోరణి తగదని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజా, ఎమ్ఆర్ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ధనుంజయ మీటింగ్ హాలులో ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా 5వ ప్లీనరీ సమావేశం సందర్భంగా ముందుగా జెండాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు సాయి, ప్రశాంత్, జిల్లా నాయకులు హరి వర్ధన్, సుజాత, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపుపై వివాదం

● దుకాణదారుడు, ఆలయ అధికారుల మధ్య వాగ్వాదం

● ఎస్ఐ చర్చలతో ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకారం



మహానందిలో దుకాణదారుడికి ఆలయ అధికారుల మధ్య వాగ్వివాదం

మహానంది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓ దుకాణదారుడు తన షాపు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాలకు దారితీసింది. ఫ్లెక్సీ తొలగింపునకు ఆలయ అధికారులు పూనుకోవ డంతో దుకాణదారుడు అడ్డు చెప్పాడు. ఆలయం ముందు టీ వ్యాపారం చేసుకొనేందుకు మహానందికి చెందిన మనోహర్‌రెడి ఈ ఏడాది మార్చిలో దేవస్థానం నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నాడు. మూడు సంవత్సరాల కాల పరిమితి కింద స్థలాన్ని దక్కించుకున్నాడు. ఇటీవల అతడు తన దుకాణం వద్ద సమోసాతో పాటు టీ, కాఫీ, ఐస్‌క్రీమ్‌లతో కూడి ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై ఆలయాధికారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం ఆలయ సిబ్బంది కొందరు దుకాణం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగించేందుకు వచ్చారు. తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తాను దుకాణంకు ఏర్పాటు చేసుకొన్న ఫ్లెక్సీని ఎలా తొలగిస్తారని దుకాణదారుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చివరకు ఈవ్యవహారం మహానంది పోలీస్‌స్టేషన్ చేరింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డితో పాటు సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చర్చించారు. దేవస్థానంకు చెందిన స్థలంలో ఆలయ అధికారుల ఉత్తర్వుల ప్రకారం దుకాణదారులు వ్యవహరించాలన్నారు. నిబంధనల ప్రకారమే తాను దుకాణం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నానని లీజ్‌దారుడు ఎస్ఐ దృష్టికి తెచ్చారు. కొంత మంది వ్యక్తిగత స్వార్థంతో కక్ష పూరిత ధోరణిగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఆలయ అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించాడు. దీనిపై ఎస్ఐ ఇరువురితో చర్చించారు. ప్రస్తుతానికి దుకాణదారుడు పెక్సీని తొలగించాలని ఆదేశించడంతో అందుకు అంగీకరించాడు. ఎస్ఐ చొరవతో ప్రస్తుతానికి సద్దుమణిగింది.

పని చేయని ఫోన్లు మాకొద్దు..

● అంగన్ వాడీ వర్కర్లు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫోన్లు పని చేయడం లేదని, ఈఫోన్లతో.. పని చేసేదెలా అని అంగన్‌వాడీ వర్కర్లు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం పని చేయని ఫోన్లు మాకు వద్దంటూ అధికారులకు అందజేశారు. సోమవారం ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, మంజుల మాట్లాడుతూ.. అంగన్ వాడీ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫోన్లు పని చేయక పోవడంతో లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్,ఎఫ్ఆర్ఎస్, ఓటిపిల ద్వారానే ఇవ్వాలని ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు అమలు చేయడానికి అంగన్ వాడీలు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో సరుకులు అన్ని ఒక్కసారిగా రాక పోవడం, నెట్ సిగ్నల్ అందక పోవడం, సర్వర్లు పని చేయక పోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌కింద మార్చాలని, పని చేయని ఫోన్ల స్థానంలో తమకు కొత్త ఫోన్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు రమాదేవి, లక్ష్మీదేవి,ప్రియాంక,చెన్నమ్మ, మహానంది, బండి ఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు మండలాల అంగన్ వాడీ కార్యకర్తలు ఉన్నారు.

నందికొట్కూరు: ఆన్‌లైన్ వర్క్ చేయలేమంటూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం సెల్ ఫోన్లను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు సోమవారం అప్పగించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్య కార్యదర్శులు మదర్‌బి, హరిత, కృషబ్బీ మాట్లాడుతూ పని చేయని ఫోన్లతో ఆన్‌లైన్ వర్కు చేయలేకపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ లక్ష్మి, ప్రసన్న, తులసమ్మ, శ్యామల, లక్ష్మీ కుమారి, శైలజ, సుబ్బమ్మ పాల్గొన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న అంగన్ వాడీ యూనియన్ నాయకులు

మహానంది: ఫోన్లలో సిగ్నల్ ప్రబ్లమ్ వల్ల తమకు కేటాయించిన పని ఆన్‌లైన్ చేయలేకపోతున్నామని మహానంది మండల అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, నారాయణమ్మలు అన్నారు. సోమవారం పని చేయని సెల్‌ఫోన్లు తమకు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఫోన్లను సీడీపీవోకు అప్పగించారు. 5జీ నెట్‌వర్క్ ఫోన్ల అందజేయాలని కోరారు.

విద్యతోనే సమాజంలో మార్పు



కస్తూర్బా పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని రవ్వలకొండ గురుకుల పాఠశాల, బీసీ హాస్టల్, కస్తూర్బా పాఠశాలల్లో తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన మినరల్ వాటర్‌ప్లాంట్లను సోమవారం బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయా పాఠశాలల వద్దకు చేరుకున్న ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతర సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయుల కోరిక మేరకు వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యావ్యవస్థ బలోపేతంగా ఉంటేనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటించి క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలన్నారు. వాటర్‌ప్లాంట్లను ఏర్పాటుచేసిన బీసీ రాజారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో స్వ రూప, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో సునీత, గురుకుల పాఠశాల ప్రి న్సిపాల్ బాలాజీ, బీసీ హాస్టల్ వార్డెన్ నాగేంద్ర, శేషారెడ్డి, మధు సూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు కృషి

చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి 5వ సచివాలయంలో సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 24గంటల వైద్యశాలను తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలచే సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంటన్న, వైద్యులు ఇమ్రాన్, అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ విజయభారతి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, మనోహర్, ల్యాబ్ టెక్నిషియన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం రేంజర్‌గా ముర్తుజావలి



రుద్రవరం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ ర్‌గా ఎస్.ముర్తుజావలిని నియమిస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ అజయ్‌కుమార్ నాయక్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. అహోబిళం ఫారెస్టు డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముర్తుజావలికి పదోన్నతి కల్పించి రుద్రవరం రేంజర్‌గా నియమించారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు

అవుకు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాశీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చౌడేశ్వరీదేవి అమ్మవారికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పూజలు చేశారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మొట్ల లావణ్య, టీడీపీ నాయకులు మొట్ల రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ ఇందిరమ్మకు ఘనస్వాగతం పలికారు. ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ నాగమల్లయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా బ్యాంకు పేరుతో కుచ్చుటోపీ

- జననీ బ్యాంకు సీఈవో అరెస్టు

కోవెలకుంట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలను నిండా ముంచి కోట్ల రూపాయలు స్వాహా చేసిన జననీ మహిళా బ్యాంకు సీఈవో ఆకుల వెంకటరమణను ఎట్టకేలకు కోవెలకుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గడ్డవీధిలో ఉంటున్న గువ్వల పద్మావతి అనే మహిళతో ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకుని వెంకటరమణ 2021 జనవరిలో పద్మావతి ఇంట్లో జననీ మల్టీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఒక ఆఫీసును ప్రారంభించాడు. పథకం ప్రకారం కోవెలకుంట్ల, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి ముఖ్యంగా మహిళల నుంచి పెద్దమొత్తంలో సేవింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు సేకరించాడు. అధిక మొత్తంలో వడ్డీ వస్తుందని నమ్మబలికి సుమారు 800 మంది ఖాతాదారుల నుంచి తన సొంత ఖాతాకు రూ. 1.50కోట్లు మళ్లించుకున్నాడు. ఖాతాదారులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డబ్బులు సమయం పూర్తయినా తిరిగి చెల్లించకపోవడంతో మహిళా బ్యాంకు వద్దకు వెళితే వారు అక్కడ లేరని చెప్పడంతో తాము మోసపోయామని స్థానిక పోలీసులను జూన్ 2న ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే ఈ కేసులో ఏ-2 గువ్వల పద్మావతమ్మ, ఏ-7 సుజాత, ఏ-8 భరద్వాజను అరెస్టు చేశారు. సోమవారం ఉదయం 10గంటలకు ఐదులాంపుల సెంటరు వద్ద ఏ-1 నిందితుడు ఆకుల వెంకటరమణను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు బెయిలు తెచ్చుకున్నారని, ఇంకో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. త్వరలోనే వారిద్దరినీ కూడా అరెస్టు చేస్తామన్నారు. ప్రజలు అధిక వడ్డీకి ఆశపడి ఇటువంటి అనధికార సంస్థల్లో డబ్బు పొదుపు చేసి మోసపోవద్దని సూచించారు.

వర్షం పడితే..అవస్థలు

- నీటికుంటలా మారుతున్న ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

డోన్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే... పాఠశాలల ప్రాంగణాలు నీటి కుంటలను తలపిస్తున్నాయి. పట్టణంలోని పాతబస్టాండు సమీప ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల ప్రాంగణాల్లో వర్షంనీరు నిలుస్తోంది. పాఠశాలలోకి వెళ్లాలన్నా.. బయటకు రావాలన్నా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షం పడినప్పుడు బురదలోనే మధ్యాహ్న భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.



నీటి కుంటను తలపిస్తున్న డోన్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం

పట్టణంలోని పాతపేట మెయిన్‌బజారులో ఉన్న ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చెట్ల కిందనే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు పాఠశాల ప్రాంగణం బురద మయంగా మారడంతో విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీ కావు. పాఠశాలల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు డైనింగ్ హాళ్లను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



డోన్ పాతపేటలోని ఉన్నత పాఠశాలలో చెట్ల కింద మట్టిలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

చిన్నపాటి వర్షం వచ్చినా..

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాల ఆర్ అండ్‌బీ రోడ్డు కంటే తగ్గులో ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు పాఠశాల ఆవరణలోకి చేరి కుంటను తలపిస్తోంది. పాఠశాలలోకి రాకపోకలు సాగించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిల్వ ఉన్న వర్షం నీటిని మోటార్ల సహాయంతో బయటికి పంపిస్తున్నారు. అయినా ఎప్పుడు వర్షం వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంటుంది. అధికారులు స్పందించి పాఠశాలలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి



వర్షం పడినప్పుడు పాఠశాలల ప్రాంగణాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. పాఠశాల ప్రాంగణలో ఎర్రమట్టిని వేసి గుంతలు పూడ్చాలి. విద్యార్థుల ఇబ్బందులపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

- సూర్యప్రతాప్, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు

పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు

- సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి
- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గం క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తిచేసుకున్న సందర్భంగా క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ కార్యకర్త సేవకుడిగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విజయ మోహన్ రెడ్డి, టీఈ రాఘవేంద్రగౌడు, ఆర్ఈ నాగరాజు, ప్యాపిలి మాజీ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసులు, మిద్దెపల్లి గోవిందు, వలసల సుధాకర్, వలసల బాలుడు, రామ్మోహన్ యాదవ్, మెట్టుపల్లె సుదర్శన్, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, మురళిగౌడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూత్ ఇన్‌చార్జిలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించే బాలికల ఆలనాపాలనా చూసుకోవాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్‌పై ఉందని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణ సమీపంలోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే కోట్ల తనిఖీ చేశారు. పాఠశాలలో జరిగిన ఘటనలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. చదువుతో పాటు బాలికలను ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాల్ అబిదాబీ బేగంను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు బాగాలేకపోతే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వివరణ ఇస్తూ పాఠశాల సిబ్బంది తనకు సహకరించడం లేదని తెలుపగా, వారిని సరైన దారిలో పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, తహసీల్దార్ నాగమణి, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, సుధాకర్, వైద్యాధికారులు డాక్టర్ సాగరిక, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తస్లీమా, వర్దన్ రెడ్డి, కౌన్సిలర్ అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య
- ఐసీడీఎస్‌లో సెల్‌ఫోన్లు అప్పగింత

డోన్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5జీ నెట్‌వర్క్ ఫోన్లను అందజేసి ఒక్క యాప్ ద్వారా పనిభారం తగ్గించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి డిమాండ్ చేశారు.

ఆళ్లగడ్డ: ఫేస్ యాప్‌లను వెంటనే రద్దు చేసి పని చేయని సెల్‌ఫోన్‌కు బదులుగా 5జీ నెట్ వర్క్ సెల్‌ఫోన్‌లను ఇవ్వాలని అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తమకు ఇచ్చిన సెల్‌ఫోన్లను ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదిన తమకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



డోన్‌లో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

కానిస్టేబుల్ ఇమాంసాకు సన్మానం

కోవెలకుంట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలగటూరు గ్రామానికి చెందిన షేక్ ఇమాంసా ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దాంతో ఇమాంసాను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధనుంజయుడు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా - మహ్మద్‌బీ దంపతుల చిన్నకుమారుడు కష్టపడి చదివి ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కానిస్టేబుల్‌గా ఎంపికైన షేక్ ఇమాంసాను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు ధనుంజయుడు, గ్రామస్థులు

వేసవిని తలపిస్తున్న ఎండలు

- ఎండుతున్న పంటలు
- వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో ప్రస్తుత వాతావరణం మరో వేసవిని తలపిస్తోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కన్న ఐదారు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం గా ఈ సీజన్‌లో వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వరకు 20నుంచి 25 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అనం తరం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడి సాయంత్రానికి జల్లులు కురిసేవి. దీంతో అన్ని వర్గాల ప్రజలు సేదతీరేవారు. గ్రామాల్లో పొలం పనులు ముమ్మరంగా సాగేవి. అయితే ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. వారం రోజులుగా గ్రామాల్లో వాన జాడ కరువైంది. క్రమంగా ఎండలు మండిపోతున్నాయి. గ్రామాల్లో ఎండలు అధికం కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. పిల్లలు, పెద్దలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల నుంచి 33 నుంచి 38 డిగ్రీలు నమోదైంది. ముందస్తు వర్షాలు కుర వడంతో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పం ట కూడా ఎండిపోతుం డటంతో రైతులు ఆందో ళన చెందుతున్నారు. ఖరీ ఫ్ సీజన్ ప్రారంభమై 50 రోజులు దాటిన వరు ణ జాడ కనిపించక పోవడంతో రైతులు వర్షం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.



చింతలచెరువులో ఎండుతున్న మొక్కజొన్న పంట

ఉసూరుమనిపిస్తున్న వరుణుడు

కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా కర్షకులకు కష్టాలు తప్పడంలేదు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి భారీ వర్షాల జాడ లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ మోస్తారు వర్షాలు, చిరుజల్లులతోనే సరిపెట్టిన వరుణుడు మళ్లీ మొహం చాటేశాడు. గత పది, పదిహేను రోజులుగా సాయంత్రం అయితే చాలు ఆకాశం మేఘావృత్తమై కారు మబ్బులు కమ్ముకుంటున్నా వర్షాలు మాత్రం కురువడంలేదు. నల్లటి మేఘాలతో ఊరిస్తున్న వరుణుడు .. అంతలోనే మాయమై ఉసూరుమనిపిస్తున్నాడు. దీంతో పంటలు సాగు చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్న అన్న దాతలు మేఘమా వర్షించుమా .. కర్షకులను కరుణించుమా .. అంటూ ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. మోస్తారు వర్షాలతో వివిధరకాల పంటలను సాగు చేసుకున్న అన్నదాతలు వరుణుడు కరుణిస్తే తప్ప పంటలు గట్టెక్కే పరిస్థితి లేదని వాపోతున్నారు.



కొలిమిగుండ్లలో కమ్ముకున్న మేఘాలు

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఈఏ అరుణ్‌కుమార్

డోన్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవా రం పట్టణలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీలో విద్యార్థులకు టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోన్ టీబీ యూనిట్ టీబీ సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్‌వైజర్ ఈఏ అరుణ్ కుమార్ సూచించారు. క్షయ వ్యాధిని నిర్మూలిం చడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రెండు వారాల దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, హెమోస్టిసిస్, చాతినొప్పి, శ్వాస ఆడకపోవడం బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడలో వాపు, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ పి.రామ చంద్రారెడ్డి, కరీముల్లా, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, ప్రిన్సి పాల్ వసుంధర దేవి, స్టాఫ్‌నర్సు నాగమ్మ, రామాంజనమ్మ, సిబ్బంది, ఏఎన్‌ఎం ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

'విద్యార్థుల హక్కులు కాలరాస్తే సహించం'

డోన్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయకుమార్ అన్నారు. సోమవారం డోన్ డిప్యూటీ డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు తప్ప మిగతావారికి పాఠశాలల్లో అనుమతించకూడదని ప్రభుత్వం తీసుకువస్తున్న నిబంధనల ఉత్తర్వులను తక్షణమే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు.

పంట నమోదు తప్పనిసరి

చాగలమర్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మా ట్లాడుతూ రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు. 15వ తేదీలోపు పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి ఉన్నారు.

రుద్రవరం: రైతులు సాగుచేసిన పంట వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏవో సుమతి సూచించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు సాగుచేసిన పంట వివరాలను రైతు సేవకేంద్రం సంప్రదించి నమోదు చే యించుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్, ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో గ్రీవెన్‌సెల్ నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

చాగలమర్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): టీజీపీ ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. సోమవారం భైరవగుండాల సమీపంలో డిస్ట్రిబ్యూటరీ ద్వారా ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట టీజీపీ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండండి

రుద్రవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని నరసాపురం వైద్యాధికారి బాబు అన్నారు. సోమవారం చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం రుద్రవరంలో ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ఎస్‌ఐగా రామిరెడ్డి



ఉయ్యాలవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా పి.రామిరెడ్డి నియామకమయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు గత నెలలో బదిలీ అయ్యారు. నంద్యాల నుంచి ఎస్‌ఐ రామిరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన తెలిపారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

- సీఐ వెంకటరామిరెడ్డి

ప్యాపిలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి ఎటు వంటి ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించకూడదని సీఐ సూచించారు. అలాగే ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా రోడ్డు భద్ర తనిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఎస్‌ఐ మధుసూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ

బనగానపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహిం చారు. అంతకుముందు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశా రు. ఈవో పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వ రరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కొలిమిగుండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఆకాంక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సుంకన్న, నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఆకాంక్ష పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమని ఎంఈవో అబ్దుల్‌కలాం అన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

సంజామల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎంఈవో - 1 రమణా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

సంజామల,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సంజామల సచివాలయ పంచాయితీ కార్యదర్శి రాంబాబు కోరారు. సోమవారం సంజామలలో పన్ను వసూళ్లు చేశారు. ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి సహకరించాలని ఆయన కోరారు.